7

సాక్షి
కుమురం భీం

బుధవారం ❘ 18 ❘ సెప్టెంబర్ ❘ 2024



కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న బండ ప్రకాశ్



అభివృద్ధిలో ముందంజ



మాట్లాడుతున్న బండ ప్రకాశ్

- వీరయోధులందరినీ పేరుపేరునా స్మరించుకుందాం
- కుమురంభీం పోరాటాన్ని సగర్వంగా చాటుదాం
- తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్
- ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



అమరులకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు

ఆసిఫాబాద్: సమష్టి కృషితో జిల్లా అభివృద్ధిలో ముందంజలో ఉందని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మహాత్మా గాంధీ, అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బండ ప్రకాశ్ ప్రసంగించారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ సువిశాల భారతదేశంలో విలీనమైందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. స్వతంత్ర భారతావనిలో 60 ఏళ్ల ఆస్తిత్వం కోసం ఉద్యమించి, స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉందని చెప్పడానికి సంతోషంగా ఉందన్నారు. ఆనాటి వీరయోధులందరినీ పేరుపేరునా స్మరించుకోవడం మన కర్తవ్యమని తెలిపారు. జిల్లాలోని అడవుల్లో తుడుం మోత మోగించి అడవి బిడ్డలను ఒక్కటి చేసి 'జల్ జంగల్ జమీన్' కోసం గర్జించిన ఆదివాసీ యోధుడు కుమురంభీం పోరాటాన్ని సగర్వంగా చాటుదామన్నారు.

ప్రజాపాలన

చివరి వరుసలోని పేదలకు కూడా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఏ పథకానికైనా అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఒకే దరఖాస్తు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. గ్రామాలకు పరిపాలన చేర్చాలనే ప్రభుత్వ ఆలోచన మేరకు గతేడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 1,45,549 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

మహాలక్ష్మి పథకం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే అమలుపర్చి చరిత్ర సృష్టించామన్నారు. ఆడపడుచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని వివరించారు. ఈ పథకం కింద జిల్లాలో 54,62,705 మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ

రాష్ట్రంలోని నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం పొందాలనే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద వైద్య చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచడంతోపాటు కొత్తగా 163 చికిత్సలు ఈ పథకంలో చేర్చామని వివరించారు. 1,835 చికిత్సలకు వైద్యం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 4,779 మంది నిరుపేదలు చికిత్స పొందినట్లు వెల్లడించారు.

రూ.500కే గ్యాస్ సిలిండర్

ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలనే లక్ష్యంతో మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంటగ్యాస్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న కార్యక్రమాన్ని 40 లక్షల మందితో ప్రారంభించగా, ఇప్పటివరకు 42.90 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. జిల్లాలో 75,289 మందికి లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వం రూ.45.30 కోట్లు సబ్సిడీ అందించిందన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు

పేద, బడుగు వర్గాల సొంతింటి కల నెరవేర్చేందుకు 'ఇందిరమ్మ ఇండ్లు' పేరుతో నూతన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 4.50 లక్షల గృహాలు నిర్మించ తలపెట్టామని, నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

గృహజ్యోతి పథకం

అల్పాదాయ వర్గాల వారికి విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 69,377 జీరో బిల్లులు జారీ చేశామని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.10.9 లక్షల రాయితీ అందజేసిందని వెల్లడించారు. ఇక ప్రభుత్వం ముందస్తు చర్యలతోపాటు జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించి వరద విపత్తులో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా ప్రజలను రక్షించుకున్నామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్



నివాళులర్పిస్తున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



కలెక్టరేట్‌లో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ విఠల్

న్యూస్‌రీల్

రెండోవిడత పీఎం ఆవాస్ యోజన ప్రారంభం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్అర్బన్: పీఎం ఆవాస్ యోజన రెండో విడతను ప్రధాని నరేంద్ర మోదీ ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా హౌసింగ్ నోడల్ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేదలు, ఆర్థిక వెనుకబడిన వర్గాలు, మధ్య తరగతి కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోటి గృహాలు నిర్మించేందుకు పీఎం ఆవాస్ యోజనను ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నిబంధనల మేరకు అర్హులకు మేలు జరిగేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగ్‌రావు, అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

రేపు సీహెచ్‌సీ కాంట్రాక్టు కార్మికుల సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్అర్బన్: సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీలో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు ఈ నెల 19న ఒక్క రోజు సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ విద్యాసాగర్‌ను కలిసి సమ్మె నోటీస్ అందించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. 19న విధులు బహిష్కరించి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మురళి, సత్తార్, గంగన్న, నీల, మమత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



జెండా వందనం చేస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసులు ప్రజా సమస్యలపై అలసత్వం ప్రదర్శించకుండా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు కర్ణాగౌడ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు లింగయ్య, రామస్వామి, వెంకటేశ్వర్లు, శ్యాంరావు, పుల్లయ్య, హన్మంతు, రాజేశ్వర్, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మహేశ్వర్ బాధ్యతలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మహేశ్వర్(పీజీటీ సోషల్) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యా బలోపేతానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ పాఠశాల నుంచి ప్రిన్సిపాల్‌పాటు 15 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ కాగా.. కేవలం ఇద్దరు మాత్రమే బదిలీపై వచ్చారు.

చరిత్రను వక్రీకరించడం అన్యాయం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజాపాలన దినోత్సవం పేరిట చరిత్రను వక్రీకరించడం అన్యాయమని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల ఎమ్మెల్యే నివాసం, రాజీవ్‌చౌక్‌లో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం జరపాల్సిందని, ప్రజాపాలన దినోత్సవం పేరిట చరిత్ర వక్రీకరించడం తగదన్నారు. అందుకే జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవానికి దూరంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ విముక్తి కోసం స్వాతంత్ర్య సమరయోధులు పోరాటాలు చేశారని, వారి ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.



జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, జిల్లా కార్యదర్శి అరుణ్‌లోయా, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు విశ్వేశ్వర్‌రావు, గొల్లపల్లి వీరభద్రచారి, దెబ్బటి శ్రీనివాస్, మనోహర్‌గౌడ్, శంకర్, శ్రీదేవి, రాణి, మోహిని, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

ఆసిఫాబాద్అర్బన్: తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని నెలకొల్పి రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతీశారని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఆత్రం సక్కు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకునే నిర్ణయాలు పూర్తిగా ప్రజావ్యతిరేకమైనవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు చిలువేరు వెంకన్న, రవీందర్, భీంరావు, సాయి, జాలీంషా, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సక్కు, బీఆర్ఎస్ నాయకులు

వ్యర్థాల నుంచి ప్రయోజనకర పరికరాలు సృష్టించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): వ్యర్థాల నుంచి ప్రయోజనకర పరికరాలు సృష్టించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. తడిచెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవాలని సూచించారు. అందరి సహకారంతో ఏరియాను స్వచ్ఛతతో ముందుంచేందుకు కృషి చేస్తామన్నారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని రెండు విడతలో నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు స న్నాహక కార్యక్రమాల్లో భాగంగా చేపట్టాల్సిన పనులు, ప్రదేశాలు గుర్తించాలని, అక్టోబర్ 2 నుంచి 31 వరకు గుర్తించి పనులు అమలు చేయాలని సూచించారు. కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేసిన డిపార్టుమెంట్‌కు బహుమతి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం ఉజ్వల్‌కుమార్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం శ్రీనివాస్, అధికారులు

తెలంగాణ అమరులకు నివాళి

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని అ మరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అధికారులు తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అలాగే లైబ్రరీలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి జాతీయ జెండా ఆవిష్కరించారు.



తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



లైబ్రరీలో జెండా ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

శిల్పులకు విశ్వకర్మ ఆదర్శప్రాయుడు

ఆసిఫాబాద్అర్బన్: నేటితరం శిల్పులకు విశ్వకర్మ ఆదర్శప్రాయుడని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏటా సెప్టెంబర్ 17న దేవశిల్పి విశ్వకర్మ పూజలు నిర్వహిస్తారని, ముఖ్యంగా కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో తప్పకుండా జరుపుతారన్నారు. హిందూ పురాణాల ప్రకారం ఎన్నో పట్టణాలను విశ్వకర్మ నిర్మించారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు భాస్కరాచారి, సురేశ్‌చారి, శ్రీరాములు, వరప్రసాద్, శ్రీమంతుల వేణుగోపాల్, మొండి తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, తదితరులు

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్



కోలాటం ఆడుతున్న మహిళలు



గంగమ్మ ఒడికి గణనాథుడు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం గణపతి నిమజ్జనోత్సవం కనుల పండువగా సాగింది. సమీపంలోని పెద్దవాగులో భక్తులు గణనాథుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు. ముందుగా ఎమ్మెల్యే హరీశ్‌బాబు, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఫ్రిజ్ దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడలోగల గోదావరి ఇంట్లో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిజ్ దగ్ధమైంది. ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం పేర్కొంది.

పాతకక్షలతో యువకునిపై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి హన్మాన్‌బస్తీలో పాత కక్షలతో ఓ యువకుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. హన్మాన్ బస్తీకి చెందిన వేల్పుల శ్రావణ్‌పై సోమవారం రాత్రి అదే బస్తీకి చెందిన రాసబత్తుల గణేశ్, గుగ్గుస్ శ్రీనివాస్ దాడిచేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ శివారు ప్రాంతంలో మంగళవారం పేకాటస్థావరంపై దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.9,210 నగదుతో పాటు 5 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. దాడిలో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఈతచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు


కాసిపేట: మండలంలోని మల్కెపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిపాముల రామాగౌడ్ మంగళవారం ఈత చెట్టు పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉదయం రామాగౌడ్ ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా తాడు తెగడంతో కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తనకు ఐదేళ్ల జైలు

చింతలమానెపల్లి: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.12వేల జరిమానా విధిస్తూ మంగళవారం ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. మండలంలోని దిందా గ్రామానికి చెందిన బాలికతో అదే గ్రామానికి చెందిన దుర్వ భాస్కర్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. భయపడిన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2020 నవంబర్ 3న పోక్సో చట్టం కింద కేసు నమోదు కాగా నిందితుడిని కోర్టులో హాజరు పర్చారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ ఎం.రమేశ్, ఎస్సై నరేశ్, కోర్టు కాగజ్‌నగర్ లైజనింగ్ అధికారి బాబాజీ, సిబ్బందిని ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు అభినందించారు.

విదేశీ విద్యకు ప్రోత్సాహం

- పథకం కింద రూ.20 లక్షల వరకు రుణం
- దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 13 వరకు అవకాశం
- అవగాహన కల్పిస్తే మరింత సద్వినియోగం



పథకానికి దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్

మంచిర్యాలటౌన్: విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతికి చెందిన ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విదేశి విద్యానిధి పథకం ద్వారా చేయూత అందిస్తోంది. ఏదేని డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్లాలని ఆసక్తి ఉన్నవారికి అందుకు అవసరమయ్యేందుకు గానూ విడతకు రూ.10 లక్షల చొప్పున రెండు విడతల్లో రూ.20లు అందిస్తుంది. నిరుపేద, మధ్యతరగతికి చెందిన ఎస్సీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పేరిట రుణాలు అందిస్తున్నారు. 2014–15లో ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకాన్ని ప్రారంభించి అమలు చేస్తుండగా అవగాహన లేకపోవడంతో పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఏటా సెప్టెంబర్, జనవరి మాసాల్లో అవకాశం కల్పిస్తున్నా ఇప్పటికీ మంచిర్యాల జిల్లా నుంచి విదేశాలకు వెళ్లిన విద్యార్థులు 20లోపే ఉన్నారు.

అవగాహన కల్పిస్తేనే..

విదేశీ విద్యకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందించేందుకు ఏటా రుణాలు అందిస్తున్నా పథకంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువమంది సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం పథకం ద్వారా లబ్ధి పొందినవారు 19 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది అక్టోబర్ 13వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయించాల్సి ఉంది. ఎంపిక ప్రక్రియ, ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ వివరాలన్నీ రాష్ట్ర స్థాయిలోనే ఉంటున్నందువల్ల ఈ పథకం ద్వారా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు? ఎవరెవరు లబ్ధి పొందారనే వివరాలు వెంటనే జిల్లా అధికారులకు తెలియడం లేదు. ఈ పథకం ద్వారా ఏటా అవకాశం కల్పిస్తున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థుల దరిచేరడంలేదు.

అర్హతలు, కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు

అంబేద్కర్ విదేశి విద్యానిధి పథకం కోసం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు 2024 జూలై 1 నాటికి గరిష్ట వయస్సు 35 ఏళ్లలోపు ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి. ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ టెస్టులో ప్రతిభ ఉన్న విద్యార్థులకు అవకాశం ఉండగా ఒక కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం ఉంది. ఇంజినీరింగ్ సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజికశాస్త్రం కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉంటుంది. టోఫెల్‌లో 60 శాతం, ఐఈఎల్‌టీఎస్‌లో 8.0 శాతం మార్కులు, జీఆర్‌ఈ, జీమ్యాట్‌లో 50 శాతం అర్హత మార్కులు పొందాలి. పీజీ, పీహెచ్‌డి చేసే విద్యార్థులు డిగ్రీలో 60 శాతం మార్కులు సాధించాలి. విద్యార్థుల కులం, ఆదాయం, జనన ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ మార్కుల మెమోలు, టోఫెల్, ఐఈఎల్, టీఎస్‌జీఆర్‌ఈ, జీమ్యాట్ అర్హత, విదేశాల్లో విద్యాభ్యాసం చేసేందుకు సంబంధిత కళాశాల నుంచి పంపిన ప్రవేశ అనుమతి పత్రం, కళాశాల ప్రవేశ రుసుం చెల్లించిన రశీదు, బ్యాంకు ఖాతా పుస్తకాలు ఉండాలి. సంబంధిత ధృవపత్రాల ఆధారంగా ఆన్‌లైన్‌లో తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్ https://telangana.epass.cgg.gov.in లో అక్టోబర్ 13 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

దరఖాస్తు చేసుకోవాలి



విదేశాల్లో విద్యను అభ్యసించాలనే ఆసక్తి ఉండి అర్హులైన విద్యార్థులకు విదేశీ విద్యానిధి పథకం ద్వారా ప్రభుత్వం రూ.20 లక్షల రుణం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విదేశాల్లో చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, మంచిర్యాల

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. మంగళవారం కృష్ణా కాలనీలోని సివిక్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో కాంట్రాక్ట్ కార్మికులను కలిసి మాట్లాడారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేసినా లాభాల్లో వాటా చెల్లించడం లేదన్నారు. దీనిపై సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఈశ్వర్, రాజన్న, తిరుపతి, కృష్ణ, హంస, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మానందం

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

శ్రీరాంపూర్: పర్యావరణానికి గొడ్డలిపెట్టుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సింగరేణి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ప్రమాదకారిగా మారిన ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా రూపుమాపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, సర్వే అధికారి వెంకటేశం, ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, పర్యావరణ అధికారి హనుమాన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

'రాజకీయ జోక్యం సంస్థ మనుగడకే ప్రమాదం'

శ్రీరాంపూర్: సింగరేణిలో పెరుగుతున్న రాజకీయ జోక్యం వల్ల సంస్థ మనుగడకే ప్రమాదమని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని అధికారులపై కొందరు మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. సంస్థ అభివృద్ధికోసం కాకుండా వ్యక్తిగత పనులు చేయాలంటూ ఆదేశిస్తున్నారని, పాటించని అధికారులపై వేటుకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. మెడికల్ బోర్డులో కూడా భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సింగరేణి సంస్థను ప్రజాప్రతినిధులు, మంత్రుల భారీ నుండి కాపాడుకోవడానికి కార్మికులు నడుం బిగించాలని ఆయన కోరారు.

ఎస్టీపీపీలో స్పెషల్ క్యాంపెయిన్ 4.0

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో మంగళవారం స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ స్వచ్ఛతను సంస్థాగతీకరించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్స్ తగ్గించడం, ఆఫీసులను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంగా కొన్నేళ్లుగా స్వచ్ఛత కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం శ్రీనివాసులు, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏసీఎంలు ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, డీజీఎం వాసుదేవమూర్తి, ఎస్‌వోటూ ఈడీ ప్రభాకర్‌రావు, పర్సనల్ అధికారి ఠాకూర్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్టీపీపీ అధికారులు

గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం అండ హర్షనీయం

జన్నారం: గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయడం హర్షనీయమని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న అన్నారు. మంగళవారం సంక్షేమ సమితి ఆధ్వర్యంలో దుబాయ్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్ ద్వారా విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎక్స్‌గ్రేషియా 2023 డిసెంబర్ 7 తర్వాత మృతి చెందిన కుటుంబాలకు వర్తింపజేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, ఎల్లయ్య, అలీం, నరేశ్, ఉప్పు సురేశ్, పెంచర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.



దుబాయ్‌లో గల్ఫ్ కార్మికుల సంబరాలు

మనస్తాపంతో ఒకరి బలవన్మరణం

దండేపల్లి: మండలంలోని చింతపల్లికి చెందిన చెల్ల సత్యం (47) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. గ్రామానికి చెందిన సత్యం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతని తల్లి చనిపోవడంతో కొంత దిగాలుగా ఉంటున్నాడు. ప్రస్తుతం భార్య మమతలో కలిసి సీసీసీ నస్పూర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం చింతపల్లిలోని పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో భార్యతో చెప్పి వెళ్లాడు. కొద్దిసేపటికి ఫోన్‌చేసి తాను చనిపోతానని చెప్పగా వద్దని అతని భార్య బతిమాలింది. కొద్దిసేపటికి చింతపల్లికి చెందిన చందు అనే వ్యక్తి ఫోన్ చేసి మీ భర్త చనిపోయాడని చెప్పాడు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

తలమడుగు: భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీస్ అధికారి ఎస్‌ఎచ్‌వో భోజన్న తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా ఉమార్కెడ్ మండలంలోని బోరివన్ గ్రామానికి చెందిన సంజయ్‌దత్త వాగట్కర్(28) తలమడుగులో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అతని భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరు...

బేల: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వరూర్ గ్రామానికి చెందిన రైతు దడంజే హుస్సేన్ (30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో అతని భార్య సరస్వతి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు ...

జైనథ్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల మేరకు మండలంలోని మేడిగూడ ఆర్ గ్రామానికి చెందిన బుద్రి వెంకన్న (59) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురిపై దాడి కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లిలో సోమవారం రాత్రి తీర్థాల తిరుపతి కుటుంబంపై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ మంగళవారం తెలిపారు. టీకానపల్లిలో నివాసం ఉంటున్న తిరుపతి కుటుంబంపై భూ వివాదాల కారణంగా బాబాయ్, అతని కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి దాడి చేయడంతో తిరుపతితో పాటు అతని భార్య మమత, తల్లికి గాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన తీర్థాల శంకరయ్య, దీప్తి, మురళీకృష్ణ, కాంద్రపు రాజయ్య, పద్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

బోథ్: మండలంలోని సొనాలలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు జాదవ్ భరత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామానికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. జీవో 194 ప్రకారం రూ.6 లక్షల పరిహారం అందించాలని, మృతుని భార్యకు ప్రతీ నెల రూ.5 వేల పెన్షన్‌ను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు తులసీరాం, తుకారాం, రాహుల్, తదితరులు ఉన్నారు.

కేకే ఓసీని సందర్శించిన డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి



డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని మంగళవారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. అధికారులను అడిగి బొగ్గు ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గనికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన కోసం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జీఎం దేవేందర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, మేనేజర్ రామరాజ్ ఉన్నారు.


ఆకట్టుకున్న భారీ గ్యాస్ సిలిండర్, బెలూన్



భారీ సిలిండర్ వద్ద డీఎస్‌వో, డీటీలు

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్‌పీజీ గ్యాస్ భారీ సిలిండర్ నమూన, ఎయిర్ బెలూన్ ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను ఆహారభద్రత కార్డుదారులకు అందజేస్తోంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో బెలూన్ల ద్వారా భారీ సిలిండర్ నమూన ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వినోద్

వేమనపల్లి: మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశంతో సహా 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. చేరిన వారిలో కుర్రు ఆంజనేయులు, జొర్రీగల వెంకటేష్, నానయ్య, రామయ్య, ఐలవేణి మల్లేశ్, గోడె అశోక్, చింతపుడి సంతోష్, శంకర్, కన్నెపల్లి సంతోష్, వెంకటేష్, కొండ గొర్ల రమేష్, మహేష్, తదితరులు ఉన్నారు.

పనిముట్ల సృష్టికర్త, వాస్తు శిల్పి విశ్వకర్మ

శ్రీరాంపూర్: దేశంలో మొట్టమొదటి పనిముట్ల సృష్టికర్తగా, వాస్తుశిల్పిగా విశ్వకర్మ నిలిచారని బీఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ అన్నారు. మంగళవారం సింగరేణి గనులపై బీఎంఎస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద విశ్వకర్మ చిత్రానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ద్వారక, లంక, అమరావతి వంటి అనేక నగరాలను నిర్మాణం చేసిన మహనీయులన్నారు. విశ్వకర్మ జయంతి ఒక కులానికి, మతానికి సంబంధించింది కాదని, కార్మిక వృత్తికి సంబంధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కాసెట్టి నాగేశ్వరరావు, మోహన్‌రెడ్డి, రాగం రాజేందర్, రమేశ్, మంద కమలాకర్, గొల్ల మహేందర్, తిరుపతి, మోత ఓదెలు, కుంట రాజు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

17న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి

జైపూర్: సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్టీపీపీ ప్రధాన గేటు ఎదుట జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, కార్యదర్శి అంజిరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీధర్, ఈగ సురేందర్, కోశాధికారి రాజశేఖర్, మధుకర్ చారి, పాత శివ, కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

సాయుధ పోరాటం చరిత్రాత్మకం

శ్రీరాంపూర్: తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రాత్మక ఘట్టమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ కటిక దుకాణాల వద్ద ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రాచరిక పాలనకు, కరుడుగట్టిన భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందన్నారు. కానీ నేడు దాన్ని వక్రీకరిస్తూ వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేయకుండా బీజేపీ కుయుక్తులు పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలవేన శంకర్

ప్రిన్సిపాల్ బదిలీ రద్దు చేయాలని ఆందోళన

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి బదిలీని రద్దు చేయాలని మంగళవారం విద్యార్థులు స్కూల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉన్నతమైన విద్యను అందించి రాష్ట్రస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ప్రిన్సిపాల్ తిరిగి పాఠశాలకు వచ్చేంత వరకు ఊరుకునేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఎస్సై రాజశేఖర్ విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో జిల్లా విద్యాధికారి యాదయ్యతో మాట్లాడించారు. బదిలీ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తా ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవో జాతీయజెండాను ఆవిష్కరించి, జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, అధికారులు ఈఈ టీడబ్ల్యూ భీంరావు, ఐటీడీఏ అధికారులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

సమ్మెబాటలో ఆరోగ్యమిత్రలు

మంచిర్యాలటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ నెల 18 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు మంచిర్యాల ఆరోగ్య మిత్రలు శారద, అనిత, సదానందం, వసంత, రవీందర్, మల్లేశ్, నానయ్య, వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాలు పెంచాలని, డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్‌ను ఆరోగ్య మిత్రలకు కల్పించాలనే డిమాండ్లతో సమ్మెకు దిగినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు సమ్మెలో ఉండి, ప్రభుత్వ నిర్ణయం మేరకు కొనసాగించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

టీచర్‌పై హెచ్ఎంకు ఫిర్యాదు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులను ఫిజికల్ సైన్స్ టీచర్ విజయ తిడుతుందని తల్లిదండ్రులు మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు శైలజకు ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో మార్కులు తక్కువగా వేస్తానని అసభ్యకరమైన పదజాలం ఉపయోగిస్తూ మానసికంగా వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేస్తానని హెచ్ఎం హామీ ఇవ్వడంతో శాంతించారు.